# BOOK - I
# సదువు కథలు

## స్మృతి

"వెనుకటి ప్రేమలు యిపుడు లేవు. వెనుకటి కాలం మల్లరాదు. ఆ ప్రేమలే వేరు. ఇపుడు భయం లేదు. భక్తి లేదు. అంతా ఆజాద్ అయిపోయింది. ఎక్కడ జూడు స్వార్థం. ఈ అవినీతి పోవాలంటే మిలటరీ గవర్నమెంటు రావాలె.... మొన్న కరెంటు మోటరు కాలిపోయింది. ఇంకో ట్రాన్స్‌ఫారం వెయ్యిమంటె ఒక్కొక్కడు........"

అరగంట నుండి అంజయ్య అదే పనిగా అరుస్తూనే ఉన్నాడు.... అది తాగిన మైకమో.... లోకజ్ఞానమో... అర్థం కాక అతని ఎదురుగా ఉన్న అక్కలు, చెల్లెండ్లు, బావలు అవునంటూ తలలూపుతున్నారు. అంజయ్య భార్య బిగకట్టిన గోచి చీరతో చెవులనిండా సొమ్ముల్తో వడ్డిస్తోంది.

కొక్కుల మల్లేశంకు అవన్నీ చెవిలో మైకు పెట్టినట్లు వినపడుతూనే ఉన్నాయి. అంజయ్య మాటలు కల్లుమత్తులా అతని హృదయంలో మెల్లమెల్లగా దిగబడుతున్నాయి. కలుగజేసుకుందామా అని అయిదారుసార్లు అనుకుని మర్యాదగా ఉండదని నోరుమూసుకున్నాడు. అయితే క్షణ క్షణానికి ఆ చర్చ శృతి మించుతోంది.

కొండగట్టు తాళ్ళల్లో చెట్టు కింద ఆదివారం సెలవు రోజు పిక్నిక్‌కంటూ వస్తే.... ఇక్కడా ప్రశాంతంగా ఉండనీయని చర్చ.... ఛ.... ఛ.... మల్లేశంకు అసహనంగా ఉంది. ఆ చర్చ ఎంతకు తెగుతదో సమజైతలేదు. చూసి చూసి కల్లు వంచే గౌడ లేచిపోయాడు... "నేను గవాల్లకు కల్లు వంచి మల్లస్త.... వచ్చి బాగసేపాయె" అంటూ. అంజయ్యకు బాధేసినట్టుంది. "ఈ సార, బీరు, బ్రాండి బందైనవోల్లె గౌడులకు ఎక్కడలేని గిరాకైపోయింది... గింతమందికి గంతగనం కల్లు ఎట్ల వస్తున్నదో....." అని గొణిగాడు.

మల్లేశం వద్దనుకుంటూనే మళ్ళీ అటుకేసి చూశాడు. ఈ వనంలో చెట్టుకు అటువైపు వాళ్ళు, ఇటువైపు వీళ్ళు. అందరి విస్తార్లలో మాంసం, చికెన్, అలిచెంత గుడాలు (గుగ్గిల్లు) ఆడవాళ్ళ ముందు కల్లుగ్లాసులు. మగవాళ్ళు మర్రి ఆకుతో కల్లు దమ్ము పట్టి (తాగి) మాంసం గుడాలమీద పడ్డారు. పిల్లలు కూడా గ్లాసుల్తో కొద్ది కొద్దిగా కల్లు రుచి చూస్తున్నారు.

సెలవు రోజు రాగానే ఆ ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు కొండగట్టుకు పిక్నిక్‌కు

బయల్దేరుతాయి. సైకిళ్ళు మొదలుకొని మారుతి కార్లదాకా కొలువుదీరినట్టు అడివీ, పొలాలూ అంతా కోలాహలంగా ఉంటాయి. ఎవరి వంట వారిది. ఎవరి జీవితం వారిది. చర్చల్లో ఎవరి ప్రపంచం వారిది... వంటల్లో ఎవరి తాహతు వారిది. వచ్చే బంధువుల్లో ఎవరి వీలువారిది.

మల్లేశం కూడా అంజయ్య కుటుంబంలాగే విడిది చేశాడు... అలాగే మటనూ, చికెనూ.... అలిచెంత గుడాలు... అయితే కొంచెం తేడా. వీళ్ల పక్కన రెండు స్కూటర్లు... అలవాట్లలోనూ కొంచెం తేడా. మల్లేశం బృందం ఆకుతో కల్లు దమ్మి పట్టే సంస్కృతి నుండి దూరమైనట్టున్నారు. ఆకుతో కల్లు తాగితే ఇపుడు వారికి స్వరం తప్పుతుంది. గ్లాసుల్తో తాగడం వారికి అలవాటై పోయింది.

మల్లేశం చిన్న కూతురు స్వప్న డాడీ కల్లు నింపిస్తున్న కొద్దీ గ్లాసులు వరుసగా యిచ్చి వస్తూ ఖాళీగ్లాసులు చేరవేస్తున్నది. కల్లుకుండ పక్కన మల్లేశం అమృతం పక్కన కుదురుగా ప్రేమగా దానికే అంకితమైపోయిన దేవదానవుల ప్రతీకలా నిండుగా కూర్చున్నాడు.... అతన్ని అక్కడ చూస్తే కొక్కుల మల్లేశం సారు అని పిలిచే బదులు కల్లుకుండల మల్లేశంసారు అని యింటిపేరు మార్చేస్తారు. ఆయన బొర్ర కల్లుకుండతో నువ్వు పెద్దా నేను పెద్దా అని పోటీ పడుతోంది... రెండు పండ్లూడిన దవడల్తో సియ్యల్తో మల్లేశం తల్లి కొక్కుల దుబ్బక్క కుస్తీ పడుతోంది.

"అమ్మా.... మన యిండ్లల్ల గీ 'బగార' (పలావు) అన్నం ఎనుకట ఉండేదానే...." మల్లేశం తల్లిని కదిలించాడు. అంజయ్యకు అమ్మతో పరోక్షంగా జవాబు చెప్పించాలని కావచ్చు.... దుబ్బక్క వేదాంతంలోకి వెళ్ళింది.

"ఎనుకట మనిండ్లల్ల ఏం ఉండేది బిడ్డ. పడుగు సరి చేసుటానికి కాసిన గంజి అంబలి దాగి బతికిన ఎడ్డి కాలం. మా నాయన్న చెప్పుండె.... ఎనుకట అన్నం దొరుకక రేగడిమట్టి తిన్నరట.... మంచిగ బతుకుడంటె మక్క గట్క (సంకటి)నే పరమానందం అన్నట్టు....గా ఎనుకటి కాలం గుర్తు చేయకు బిడ్డా.... పటేండ్లు, పట్వారీలు, దొరలు ఎంత గోస పోసుకున్నరో నీకేం ఎరుకరా.... వాల్లకు కోరిన తీరుగ బట్టలన్ని సొంతంగ నూలు కొనుక్కచ్చి నేసి యియ్యాలె.... పైసలు అడుగవశమా.... పబ్బుతివట్టి (రెండు చేతుల్తో దండం పెట్టి) వంగి వంగి నిలబడాలె... నోటితోటి అడిగేది లేదు..... అడుగుతె కతమేనాయె.... ముప్పయి రూపాయల బాకికి మూడేండ్లు ముడ్డిసుట్టు దిప్పు కుందురు....."

"అత్తా మరిగా అంజన్న... గట్ల ఎనుకటి కాలమే మంచిగుండె అంటుండె ఒక్క మాటనవు...." దుబ్బవ్వ చిన్నల్లుడు కస్తూరి రాజేశం ఒసుగు (మరికొంచెం కలుపుడు) వేశాడు.

కల్లు వడ్డన ఆ రౌండు పూర్తి చేసి స్వప్న తన విస్తరి ముందు కూర్చుంది. గ్లాసుతో కల్లు చప్పరిస్తూ సియ్యలు కొరుకుతూ నానమ్మ కేసి ఆసక్తిగా చూస్తోంది. లౌక్యం తెల్సిన దుబ్బక్కకు కోడి తప్పిపోతే కోడి మీద పెట్టె ఎన్నిదిట్లాలో తెల్సు... "ఇక్కడికి కొట్లాట పెట్టుకునుటానికి వచ్చినమా అల్లుడా...." అంటూ ప్రారంభించింది.

"వాల్లతోని మనకేందే సప్నా... వాల్లు ఎవుసం చేయించుకునే గుడేటి కాపోల్లున్నట్టున్నరు. ఆల్ల నగలు చీరె కట్టిన తీరు, కొంగు వేసిన తీరు చూస్తుంటే తెలుస్తలేదా... మందితోని ఎనుకట ఎట్టికి పని చేయించుకొని బతికి యిపుడు పని చెయ్యక సెడిపోయిన గాడ్దులు గట్లనే అంటరు... ఎనుకటి కాలం మంచిగుండె అని.... వాల్ల లగ్గాలకు, పండుగలకు, పబ్బాలకు ఊరోల్లంత ఎగవడి 'ఎట్టి' జేస్తే ఎనుకట ఎంత ప్రేమ.... పల్లెలల్ల అని బడాయిలు చెప్పుకునుటానికేంది బిడ్డా... ఎట్టి జేసినోల్ల నడుగుతె తెలుస్తది. అది బాధకు చేసిన్రో, ప్రేమకు చేసిన్రో,..... గీ అన్నలు వచ్చినంక అల్కగ అయింది."

"నానమ్మా చీరె కట్టుడు, నగలు చూసి ఎవలది ఏ కులమో ఎట్ల చెప్పవస్తదే...." స్వప్న

ఆసక్తిగా అడిగింది.

"ఎనుకటి మనుషులు గట్ల ఉందురు... ఇప్పుడు అందరు ఒక్క తీరుగనే గడ్తున్నరు..."

"అమ్మా..... ఎనుకట బతుకమ్మ పండుగులు మంచిగ చేస్తురట గదనే...." దుబ్బవ్వ చిన్న కూతురు,.. కస్తూరి సరోజ కల్లుగ్లాసు ఖాళీ చేసి అడిగింది.

"మంచిగ అంటె మంచిగనే చేస్తురు. ఊరోల్లందరు గల్సి దొరల, పట్వారి పటేలు యిండ్లల్ల బతుకమ్మలు తీసుకొని ఆడుటానికి పోవాలె.... అన్లకల్లి మంచిగ కనపడ్డోల్లను వాల్లు ఎపుడు యింటికి పిలిసి పట్టె మంచం ఎక్కుమంటరో తెలువది.... గొడ్ల కొట్టంలనో, పెరట్ల మంచెల కాడనో.... ఎక్కడికి గుంజుకపోతరో తెల్వది.... మంచి చీరె కట్టుకోను భయం... ఎవని కంట్లె మన్నుపడుతదో.... తెలువది.... నన్ను గట్ల చిన్నదొర గుంజిండని.... ఓ రాత్రి పొలం నుంచి రాంగ మీ నాయిన్న మా అన్నగాడు, తమ్ముడు గల్సి పొట్టు పొట్టు తోమి, పురుసోల్లు (పురీషాలు) వడివెట్టి చెయ్యి యిరుగ్గొట్టి ఆ ఊరు యిడిసిపెట్టి యిపుడున్న ఊర్లెకు బతుకచ్చినం.... ఎనుకట గట్ల సాగిచ్చుకున్నోల్లకు ఇపుడు కాలం చెడిపోయిందనిపియ్యదా...."

"ఎనుకట ఏమున్నది బిడ్డా.... ఆల్లకు ఇపుడు అగ్గువకు కూలికి మనుషులు దొరుకుతలేరని బాధ.... యాడాదికి యిన్ని మక్కలు జొన్నలు పారవోస్తె సాకల్లు, మంగల్లు, శాలోల్లు, వడ్లోల్లు అన్ని పనులు చేసే కాలంపాయె..... మాలోల్లు, మాదిగోల్లు అరబ్బు దేశాలకు పోయి సంపాయించుక రావట్టిరి.... ఆడోల్లు బీడీలు చెయ్యవట్టిరి. ముప్పయి రూపాలిస్తమన్నా పొలం పనికి వోకపోయిరి.... అందరు తెల్లబట్టలేసుకొని తెల్లగ బతుకవట్టిరి..... యివన్ని జూసి ఎందుకు కండ్లుమండ్లై బిడ్డా.... ఎనుకటి ఎడ్డి కాలం గాకపాయె..... అరె తొరెయి అంటె మర్రవడవట్టిరి. గీ అన్నలచ్చినంక అందరి పెద్దిరికాలు పాయె.... అందరు ఆజాదై పోయిర్రు అని అంటె అనరా బిడ్డా... ఎట్టి జేయించుకొని కాలు మీద కాలేసుకొని బతికినోల్లకు ఎనుకటి కాలమే మంచిగుండకపోతె..... ఏది మంచి గుంటది బిడ్డా...." దుబ్బవ్వకు కల్లు నిషా ఎక్కుతుంటె ధైర్యంగా గొంతు విచ్చుకుంటోంది. ఎక్కడి జ్ఞాపకాల్లో కడుపులోంచి దేవుకొస్తున్నాయి.

"బిడ్డా.... ఎనుకట గిట్ల మాంసం తిందామంటె ఎల్లకపోవు... రోగమచ్చిన గొర్రెలు సచ్చిపోతే అగ్గువకు కొనుక్క వస్తురు.... సచ్చిన గొర్లకు సంకలు గొట్టెర శాలీడు... అని పేరు బదునాం జేసిర్రు.... ఎవలు మెచ్చని చీరెలు దోతులు అమ్మక మీదవడితే కట్టుకోక తప్పుతదా... దాంతోని సాలె సంకటం - గోసిల యిరుకటం అని ఎక్కిరిస్తురు.... మనం నేసిన బట్టలు గట్టుకొని మననే పేరునాల జేస్తురు. ఇయ్యాలంటె మిల్లులచ్చినయి. ఎనుకటి రోజుల నుంచి సిన్నోల్లు, పెద్దోల్లు అందరు కట్టింది ఎవల బల్ల. నాగరీకం నేర్పిన మనకే పేరునాల వెట్టి ఎక్కిరిచ్చిన కాలం అది.... తీరొక్క బట్ట నేసింది మన కులపోల్లు గాదా.... బట్టల్లేని మనుసుల్ను ఎడ్డిమనుసులనరా....."

"ఎనుకట ఏమున్నదిర.... ముప్పయి ఏండ్ల కిందటిదాకా కూడా దేనికైనా ఎడ్లబండే గతి. మనకు ఎవుసం లేకపాయె. ఎడ్లబండి మనకెక్కడిది. ఎక్కడికన్న జాతర పోవాలంటె ఎడ్లబండి కిరాయకు అడుగుతె ఎక్కడలేని ధరచెప్పిరి..... ఎవుసపు ఎడ్లు బండి కిరాయకు కట్టమనిరి.... నువ్వు కడుపుల వడ్డప్పుడు గిట్లనే కొండగట్టు ఆంజనేయస్వామికి మొక్కుకున్నం. నేను నీల్లు పోసుకుని ఉంటి. అయిదోనెల... కొండగట్టుకు కచ్చురం కట్టుమంటే ఎవలు కట్టకపోయిరి.... కోడిపుంజు, సామాను మోసుకోని అందరం ఒక రోజంత నడుసుకుంట ఓ రాత్రికి యిక్కడికి చేరినం.... మీ అక్క నడువరాక.... మీ నాయిన్న భుజం మీద ఎత్తుకుని నడిసిండు.... కాల్లన్ని పీక్కపోయె... తెల్లారి మల్ల గుట్టెక్కి దిగేటాల్లకు పిక్కలువాయె.... ఏందిన్నం కొడుకా.... ఇపుడేమో స్కూటర్లమీద రావడ్తిమి... సామాను దీస్కోని బస్సుల రావడ్తిమి.... అన్ని గ్రైండర్ల దంచుకొని రుబ్బుకొని వచ్చి గంటలోపల వంట చేస్తిమి....

ఆ కాలంల.... గిస్నితీర్ల వంటలెక్కడ వచ్చురా.... చింతపండు చారు తీరుగ ధన్యాలపొడి యింత కారం ముద్దవేసి ఉడికిస్తే పులుసును ఊదుకుంట తిందుంటిమి... ఇపుడు జూడు... కొండగట్టు మీదికి కూడా రోడ్డేసిరి బస్సులు, స్కూటర్లు రావట్టె....

"అపుడు రాత్రుల్లు ఎంత భయమయ్యేటిదో.... గీ కరెంటు ఎక్కడిదిర.... పొద్దుగూకుతె చీకటివడె. ఆయిందపు (ఆముదాల) నూనెతోని దీపంతల యింత దీపం ఎలిగిచ్చుకొని గట్క తిని పంటె మల్ల తెల్లారెదాక..... ఎన్ని దోమలురా... అప్పుడు.... మీ నాయన్న మగ్గం నేసి నేసి అదే వోతది తియ్యి అనుకుంట గదే సలిజరంతోటే సచ్చిపాయె.... నీకన్న ముందు పుట్టిన బిడ్డ మూడేండ్లకే పోషమ్మ (మశూచి) అయి సచ్చిపాయె..... మా అయ్య పల్లెలు తిరిగి బట్టలు ఉద్దెరమీద యిచ్చిరాంగ చీకట్ల పురుగు (పాము) కుట్టిసచ్చె.... గప్పుడు గిన్ని మందులు గింతమంది డాక్టర్లు ఎక్కడున్నర్రా.... ఏదో పేడు (పుల్ల) కుచ్చుకున్నదనుకొని మా అయ్య అట్లనే నడుసుకుంట యింటికచ్చి నురుసులు (నురుగులు) కక్కిసచ్చె.... మంత్రం ఏయించుటానికి కూడ టైం లేకపాయె.....

"మా సెల్లె బాలెంత రోగం వచ్చి ధనుర్వాతంతోని కొట్టుకొని కొట్టుకొని పానమిడిసె.... ఏం దిన్న నాకు కడుపు నొప్పేనాయె.... తక్కలి ఆకు ఎల్లిపాయకారం దంచుకుని ముద్దలు మింగుడు దప్ప నాగోస చూసినోల్లెవలురా... యాల్లకు కండెలు సుట్టి అందియ్యక పోతె ల్యాకబద్ద వట్టి మీ నాయిన్న నా లగ్గం జేసు.... గొడ్డును కొట్టినట్టు కొడ్తుండె.... ఆ పడుగు సరిచేసుటానికి గంజి అడుక్క రమ్మను. ఆల్లు పోంగనే పోస్తరా.... ఏదో పనిజెప్పిరి.... ముచ్చటవెట్టిరి... మీ నాయిన్న ఇంతసేపు ఎవుల దగ్గర పన్నవు లంజే.... అనె సికెంటికలు వట్టి ఎట్ల కొట్టుతుండె... భగవంతుడా... గా కట్టాలు పగోల్లకు కూడ వద్దు.

"ఎన్నని ఏగిచ్చినర.... నిన్ను సదివిచ్చుటానికి ఎంత కష్టమైందిర.... బడి లేనప్పుడల్ల మగ్గం నేయిమంటె నువు ఆటకోయిలతనం జేస్తే... నీ మీద ఎన్ని ల్యాకబద్దలు (పడుగు పేకల మధ్య వాడే వెదురుబద్దలు) యిరిగినయో.... నీకు యాదికి ఉన్నాదిర...."

"మీ నాయిన్న ఉన్నపుడు సుకపడలే.... పోయినంక సుకపడలే.... గీ బీడీలు చేసుడంట వచ్చినంక కొంచెం నయమైంది.... లేకపోతే మన శాలోల్లంత ఆకలికి సచ్చిపోదురు కొడుకా... బొంబాయి బీవండిల ఎంత మందికని సాంచెలల్ల పనిదొరుకుతదిర.... పోరగాన్లను వట్టుకొని నేను ఇక్కడ మీ నాయిన్న ఒక్కడు అక్కడ.... బొంబాయిల పొట్టకు దినుకుంట కడుపు గట్టుకొని యిన్ని పైసలు పంపిస్తె.... గీకాడికి అచ్చింది..... ఎన్ని కష్టాలు పడితె నువ్వు ఎదిగినవుర....

"సదువైనంక ఉత్తగనే తిరిగితివి.... బీడీలు చెయ్యిరా అంటే నీ పానం వంగకపాయె... దుకాన్ల జీతముంటివి గని బీడీలు చేయకపోతివి.... ఏదో గా ఆపతి మల్లన్న జాబుల నూట యిర్వై రూపాయలకు నౌకరి దొరికె....."

"ఆపతిమల్లన్న కాదత్తా..... హోప్ ఎ మిలియన్ జాబు అనే స్కీము కింద పందొమ్మిది వందల డెబ్బయి మూడుల హెచ్.సి.సరీన్ అనెటాయన గవర్నర్ పరిపాలన ఉన్నప్పుడు అయిదు లక్షల ఉద్యోగాలు అని పెట్టిండు...." కస్తూరి రాజేశం సవరించాడు....

"ఏదో అల్లుడా.... అదేదో నాలిక తిరుగకపాయె.... గనౌకరిచ్చి గుట్టలల్ల పల్లెల పొంట ఏస్తె... నేను ఎంత ఏడ్సిన్ననుకున్నవు... మంతెని మాదేవుపూర్ దాటిపోవాలె... కాని రాజ్యం అది... ఎందుకు బిడ్డా గంత దూరం వద్దని ఏడ్సిన.... ఏమో.... దొరలెసొంటోల్లో... దొంగలు ఎసొంటోల్లో.... ఎవలు కండ్లల్ల మన్నువోసుకుంటరో... వానకాలంల అటు చిక్కువడితె మల్ల ఎండలు ముదిరెదాక ఆ వూర్లెకెల్లి ఎటు పోరాక పోవు.... చుట్టు వాగులు, బురదలు... ఊడు... ఏంది నీయ.... అది మన కరీంనగర్ జిల్లానేనాయె.... నేనేమన్న బొంబాయి పోతున్నానె... అని ఆడు జనుప చెయి సంచిల బట్టలు వెట్టుకొని

వండుకోను రెండు గిన్నెలు ఏసుకొని పాయె.... అక్కడ నాలుగేండ్లు జేసి జగిత్యాల తాలూకాకు తబాదిలా (బదిలీ) చేయించుకున్నంక బతుకు తిరమాయె... అప్పటిదాకా ఈ కోడలు... నేను సంసారమే జెయ్యవోనని యిడుపు కాగితం కోసం కులంల పంచాయితే వెట్టిచ్చె.... మీ మామపోయి నేను ఒక్కదాన్ని ఆ పంచాయతులన్ని ఏగిస్తి.... కులపెద్దలకు కల్లుపోయించి పోయించి దీని పంచాయతులకు నా మెడల గుండ్లు (బంగారు గుండ్లు) అమ్మితి.....

"ఇపుడు... ఎవలు సుకపడ్తన్నరే... కోడలా... మేం గంతగనం కష్టపడితె నువ్వు నీ మొగుడు - నీ పిలగాన్లు సుకపడుతున్నరు... ఇపుడు సన్నను నెలకు నూరు ఫీజులిచ్చుకుంట ఇంగ్లీషు మీడియంల సదివియ్యవడ్తిరి.... ఇప్పుడు నా కొడుక్కు నెలకు అయిదు వేలు వస్తున్నయి. ఎనుకట ఏమున్నదే కోడలా... ఇరువై నంబరు (దొడ్డు ముతక) చీరెలే గతి.... అరవై నంబరు (సన్నపు చీర) చీరెలు అపుడు ఎంతమంది కట్టిన్రు.... ఇపుడు అందరు అరవై నెంబరు, నూటిరువై నెంబరు చీరలు.... ఇంకా ఏంటెంటియో చీరెలు..... ఎనుకట గివన్ని ఎక్కడియే కోడలా...."

"ఆల్లు గుర్తుపడ్తలేరుగని.... గీ అంజయ్య నాయిన్ననేరా... గప్పుడు ఎనుకట కొండగట్టుకు కచ్చురం కట్టుమంటె కట్టలేదు... ఈ అంజయ్య అమ్మమ్మ గారింటికాడ పెరిగిండు... వాల్ల అవ్వలు యిద్దరే. మేనమామలు లేకుండిరి. ఆల్ల తాత పోయినవోల్లె... అంజయ్య అవ్వ అందర్ని తల్లిగారింటికే బయల్దేరదీసింది. అక్కన్నే భూమిజాగలు మంచిగ ఉన్నయని.... ఉన్న ఊరుల అమ్ముకొని ఊరిడిసి పోయిన్రు.... అటెన్క అయిదేండ్లకు మనం ఆ ఊర్లెకెల్ల ఎల్లి (బయల్దేరి) వచ్చినం......

"అయినా ఆల్లకేమైందిరా..... రెండు కరెంటు మోటార్లచ్చినై. కెనాలు కాల్వ కింద రెండు పంటల భూములు..... వాల్లు గూడ స్కూటర్ల మీద తిరుగుతున్నరు... ఎనుకటి తీర్గ ఏమన్న యాతాలు (ఏతం) పోస్తున్నరా..... మోటగొడ్తున్నరా.... స్టాటర్ ఒత్తి పురుసత్ (తీరిక)గ ఆ పని ఈ పని చేసుకుంటరు.... సిన్నప్పుడు నీ అంత ఉన్నప్పుడు ఎంత కర్రెగ ఉండె అంజయ్య. ఇపుడు జూడు... నీడ పట్టున ఉండుకుంట ఎంత తెల్లవడ్డరో.... మల్ల ఎనకటి కాలమే మంచిగుంటదంటరు..... ఎద్దుగుద్ద పొడుసుకొని బతికిన ఎనుకటి కాలం తీరుగనే ఉన్నదా గిపుడు..... మొన్న సప్న పుట్టినరోజుకు దాని దోస్తులు.... మన సుట్టాలు ఎంతమంది వచ్చిన్రు... ఎనుకట లగ్గాలకు కూడా గింతమంది రాకపోదురు.... ఏ కులపోల్ల లగ్గంకు ఆ కులపోల్లె వస్తురు. ఇపుడు.... కులపోల్ల కన్నా దోస్తులే ఎక్కువవస్తున్రు... ఎనుకట రాజులు కూడ గింత మందికి భోజనాలు పెట్టిన్రో లేదో.... పెండ్లిల్ల ఎంతమంది.... ఎంత సంబ్రం... ఎనుకట. మీరు యిరవై యైదు మంది-మేం యిరవై అయిదు మంది అని పెండ్లికి వచ్చెటోల్లను కరారు చేసుకుందురు. కచ్చురాలకు ఎవలు గడ్డివెయ్యాలె.... అని కొట్లాటవుతుండె.... వడ్లనకాడ కులం తప్పు తీస్తురు....

కల్లు తాగుతూనే ఉన్నారు. గుడాలు మాంసం చికెన్ పొట్టలో పడుతూనే ఉన్నాయి. ముచ్చట్లు నడుస్తూనే ఉన్నాయి. దుబ్బక్క మరింత వేదాంతంలో పడిపోయింది. అటు అంజయ్య ఏదో నరుకుతూనే ఉన్నాడు.... ఆ చర్చలు వింటే మేధావులు మూర్ఛపోవాల్సిందే... స్వప్నకు పిల్లలకు అదంతా స్వప్నసందేశంలా ఆసక్తిగా ఉంది..... సకుటుంబంగా పిక్నిక్ రావడంలో ఉండే సౌకర్యమే యిది. హృదయాలు విచ్చుకుంటాయి. పిల్లలు పెద్దలు తమ చరిత్రను సంస్కృతిని తమకు తెలియకుండానే తెల్సుకొని ఒంటబట్టించుకుంటారు.

★ ★ ★

కస్తూరి దుబ్బక్కకు కడుపు నొప్పి కోసం ఆపరేషన్ అయి ఆసుపత్రిలో ఉంది. కోడలు సపర్యలు చేస్తోంది. ఇద్దరికి క్యారియర్ తీసుకొని మధ్యాహ్నం బయల్దేరాడు మల్లేశం. ట్రాఫిక్ జాం అయిపోయింది. ఏమైందో చూద్దామని స్కూటర్‌ను నెట్టుకుంటూ ముందుకు కదిలాడు. లోవోల్టేజి వల్ల కరెంటు పంపు సెట్లు కాలిపోతున్నాయని, గిట్టుబాటు ధరలు కావాలని ఎవరో అరుస్తున్నారు.

ఎక్కడో చూసినట్టు గుర్తొచ్చింది. కొండగట్టు కాడ ఒకే చెట్టు కింద..... అంజయ్య.

ట్రాఫిక్ జాం అయిపోయి రెండు గంటలైంది. పోలీసులు లాఠీఛార్జీ చేయడానికి వెనకా ముందాడుతున్నారు. మల్లేశం ఏదో అందామనుకునే లోపలే అదే మాట ఎవరో అననే అన్నారు.

"అంతా భయం లేకుండై పోయింది. రోడ్డుమీద తాత జాగీరున్నట్టు ఇదేం కథ... ఛ,ఛ.... మిలటరీ ప్రభుత్వం వస్తేగానీ తిక్కకుదరది".

అంజయ్యకు ఆ మాటలు ఎక్కడ తాకాలో అక్కడ తాకాయి. అటుకేసి తీక్షణంగా చూశాడు. "అనండయ్యా అనండి.... రైతే దేశానికి వెన్నెముక అంటారు.... మమ్ముల కాల్చి చంపటానికి మిలిట్రీ ప్రభుత్వం కావాలంటరు."

"నువ్వే కోరితివి గదయ్యా మిలట్రి ప్రభుత్వం" అని మల్లేశం అనబోయి నోరు మూసుకున్నాడు. వెనక్కి తిరిగి సందుల్లోబడి ఆసుపత్రి చేరుకొని క్యారియర్ యిచ్చేసి బడికి పరిగెత్తాడు......

స్టాఫ్ రూంలో మొండయ్య శాస్త్రి వెనకటి కాలమే గొప్ప అని ఏదేదో కోస్తున్నాడు.... వేద కాలంలోనే...." అంటూ ఏదో కోయబోయాడు. "బ్రాహ్మలు కూడా ఎడ్లు కోసుకు తిన్నారు. యజ్ఞయాగాలన్నీ గవ్వే" అని పూరించాడు మల్లేశం. దాంతో పెద్ద వాగ్వాదమే అయింది. "మీరు ఎన్ని చెప్పండి. వెనుకటికన్నా.... సమాజం యిపుడే బాగుంది. నా పూర్వీకుల జీవితం కన్నా నేనిపుడు గెల్చుకున్న ఈ జీవితమే నాకు బాగుంది...." మల్లేశం వాదన ముందు మొండయ్య శాస్త్రి అవాక్కయిపోయాడు.

బడి వదిలాక సాయంత్రం స్వప్నను తీసుకుని మల్లేశం ఆసుపత్రి కెళ్ళాడు తల్లి కోసం... ఆసుపత్రి నిండా జనం. అంజయ్యకు లాఠీఛార్జీ తొక్కిసలాటలో చేయి విరిగింది. కట్టు కట్టారు. పరామర్శించడం కోసం జనమే జనం.... విలేఖరులు... ఎమ్మెల్లే..... తోసుకొని వెళ్ళాడు మల్లేశం... "ఏమాయె ఈ కాలంల ప్రేమలు తక్కువంటివి" అని అడుగుదామనుకుని నోరు మూసుకున్నాడు మల్లేశం. డాడీని వదిలించుకొని స్వప్న అంజయ్య బెడ్ ప్రక్కన చేరింది. "ఏమైంది అంకుల్". "ఆరోజు కొండగట్టు కాడ కల్సినం, గుర్తున్నదా అంకుల్....". అంత మందిలో అంజయ్య కంట కన్నీరు.... అవి కన్నీరో, ఆనందభాష్పాలో.

***23-3-97,***

***ఆదివారం ఆంధ్రజ్యోతి.***